# వజ్రముఖులు

## రాజేంద్ర

గంగులు, గంగీ, కూలికి వెళ్ళి పొద్దు పోయే సమయానికి ఇల్లు చేరుకున్నారు. ఇంకా బావిపనికి వెళ్ళిన నాగన్న, లక్ష్మి, నాగమ్మ ఇల్లు చేరుకోలేదు. దాదాపు రెండుమైళ్ళ దూరాన పనిచేసి, అక్కణ్ణుంచి రావాలి. అందుచేత ఆముగ్గురూ రోజూ ఆలశ్యంగా రావడం మామూలే.

గంగి బజారునుంచి తెచ్చిన బియ్యమేసి త్వరగా కూడొండి పెట్టేసి, చింతకాయ పచ్చడి చేసింది. గంగులుకు పెళ్ళాం చేసిన చింతకాయ పచ్చడి మా రుచిగా వుంది.

"ఏం చేశావే......నీ చల్మకంతా...ఈ పొద్దు కుదిరింది" అన్నాడు.

"ఇన్నాళ్ళు...నే చేయాలా....నువ్వు తిన్నా...సడేలే!" అని విసుక్కొంటూనే, మొగుడికి పచ్చడి నచ్చినందుకు సంతోషించింది గంగి. కొడుకూ, కోడలూ, కూతురు వచ్చి అంత గతికేశారంటే, పస్తోకి దిగొచ్చుననుకొంటూ, అన్నం తిని, చల్లగా గంజి తాగి, అరుగుమీద కూర్చున్నాడు గంగులు. దూరాన కోడలు మాటలు వినిపించి, మీద కప్పుకొన్న పైపంచి తీసి, మట్టి అరుగుమీదవేసి పైకి లేచాడు.

"ఏమేయ్...ఆళ్ళువొస్తావుండాల్లే...అవన్నీ ఆడ పెట్టేసి ఆంక నువ్వు పన్లోకి రా" అనేసి లోపలికి వెళ్ళి గడ్డపారా, పారా, తట్టలూ తీసుకొని బయటకొచ్చాడు.

పనిముట్లు పునాది గాడిలోవేసి తిన్నగా దిగి గడ్డపలుగుతో త్రవ్వడం ప్రారంభించాడు.

పౌర్ణమి రాత్రి, పుచ్చపువ్వులా వుంది వెన్నెల. పట్టపగలులా అన్నీ, అంతా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కడగాలు త్రవ్వి, మట్టి తట్టల కెత్తుతూ వుంటే, గంగి వచ్చి మట్టి గట్టుమీద పోయసాగింది.

కొడుకు, కోడలు, కూతురు వచ్చారు. అన్నాలుతిని గంజిత్రాగి పనిలోదిగారు.

పని చేస్తూవుంటే గంగులుకు మహా ఆనందంగా వుంది. కూతురు పెళ్ళినాటి కల్లా ఇల్లు కట్టేస్తాననుకొన్నాడు. కొత్త యిల్లు ఎలావుండబోతుందో, వాడలో వాళ్ళు, ఊళ్లో రైతులు తనను, తనఇంటినీ చూసి ఎలా ఈర్ష్యపడతారో కూడా వూహించుకొన్నాడు. ఇప్పటికే అందరూ – "గుట్టుగా గుడిసెలో పడి వుండక, ఊరికే రాత్రీ పగలు వొళ్ళు విరుచుకుంటున్నాడు. అన్యాయంగా పెళ్లాం పిల్లల్ని కష్టపెడుతున్నా"డంటున్నారు. తనకు బూసయ్య పొలం దున్నుతున్నప్పుడు పెద్ద లిబ్బి దొరికిందని కూడా అనుకొంటున్నారు.

తను ఎంత కష్టపడి కొంత డబ్బు మిగిల్చి కడగాలుకు రాళ్ళు కొట్టించాడో ఎవరికి తెలుస్తుంది? తను, తనవాళ్ళు ఎన్నాళ్ళకూలి డబ్బులు కానీ, వక్కా ఆకుకు ఖర్చుపెట్టకుండా ఎలా కూడ

బెట్టారో ఎవరు వూహించగలరు? సోమరి తనం లేకుండా, ఇంట్లో అందరూ కష్ట పడుతున్నారు. వర్షానికి, ఎండకు, చలికి, గాలికి కాపుగా సౌఖ్యంగా ఇల్లు కట్టుకో వాలనుకోవడంలో తప్పేముంది. ఈ హరి జనవాడలో పూరిళ్ళు గుడిసెలు తప్పించి, ఎవరికీ ఒక పెంకుటిల్లుగానీ, మిద్దెగానీ లేదు. తనే మొదటిసారి అంత సాహసం చేశాడనీ, తను రేపు పెంకుటిల్లువేస్తే, తన సంపదనూ ఈ వాడను నాయకుడుగా చూస్తారని అనుకున్నాడు తను, సుఖంగా ఇంట్లో వెచ్చగా పడుకోవాలనుకొంటు న్నాడంతే. అనుకొని నేలగా నిట్టూర్పు విడిచి పల్లగా ఇచ్చుకొని, ఒక్క మూలుగు మూలిగి, గడ్డపారకు అడ్డొచ్చిన బండరాయిని, ఒక్క వూపున పెళ్ళగించేసి "నాయాలి రాకుండా యాడపోతుందిలే" అన్నాడు గంగులు!

సింగరయ్య కుంటుకుంటూ వచ్చి అరుగుమీద కూర్చున్నాడు.

"ఎవడనా నాయాల్లు, ఏం కష్టపడుతుం డార్రా పిల్లగ అంత గతికేసి గుడిసెలో పడుండక" అని ఏసంటూరా అని పని చేస్తున్న వాళ్ళను చూశాడు.

"నోరు మూసుకొని కూర్చో. ముసలి ముక్కలా వూరికే మొరగొద్దు" అన్నాడు నాగన్న.

"అదే నల్లే రా పిల్ల ఎదవా! వోరి గంగులూ...వూరంతా అంటా వుండారే మిరా...... నీకేదో పెన్నిధి దొరికిందని. లేపోతే నువ్వు మాలఎదవ...ఇల్లు కట్టే దేమిటే?" అన్నాడు.

"పెన్ని దొరికితే ఇల్లు ఇంత్రంతా కష్ట పడి ఎందుకుసస్తాం మామా!" అన్నాడు నెమ్మదిగా గంగులు.

"పోన్లే! ఏదో ఇల్లు కట్టుకోవాలా అని నువ్వు! గిట్టనోళ్లు కన్ను కుట్టి ఎన్నైనా అంటార్లే. సంగాని పోవాల్లే కనాన్న వుంటే ఇట్లఎయ్యరా" అన్నాడు ముసలి సింగరయ్య.

గంగి తిత్తితీసి అంటులించి కొంత పొగాకు కాడ తుంచి సింగరయ్య వొడి లోకి వేసింది. సింగరయ్య అందులో కొంత తుంచి నోట్లో వేసుకొని, మిగతా బొల్లో దోపుకొని లేచి, తిన్నగా కుంటు కుంటూ వెళ్ళిపోయాడు.

వాడంతా నిద్రపోతోంది. గంగుల కుటుంబం పనిచేస్తూనే వున్నారు.

గంగులు గడ్డపలుగుకు ఏదో అడ్డొచ్చింది. బలంకొద్దీ గడ్డపలుగు పైకెత్తి బలంగా దిగపొడిచాడు. ఖంగుమని మోగింది! పైకితీసి ఇంకోసారి వేశాడు. మళ్ళీ ఖంగుమంది.

"నేను నాయన్నా ఈడేదో ఖంగు మంటూందిరా" అన్నాడు గంగులు క్రిందికి జాగ్రత్తగా చూస్తూ.

నాగన్న పొగ క్రిందపడేసి దగ్గరగా వచ్చి గంగులు దగ్గర గడ్డపార తీసుకొని 'ఖంగుమన్న చోటు' మట్టా త్రవ్వి మట్టి తీశాడు. లోపల ఏదో నల్లగా గుండ్రంగా కనిపించింది. తిన్నగా త్రవ్వి దాన్ని పైకి తీశాడు. నాగమ్మ, లక్ష్మి దగ్గరగా వచ్చి గట్టుమీదినుంచి వంగిచూస్తున్నారు. అది చిన్న కుండ! పంచి ఒకటోరకమైన గట్టికుండ!

"దీంట్లో ఏందో వుందప్పా" అంటూ నాగన్న దాన్ని గుడిసెలోకి తీసుకెళ్లాడు. అందరూ ఇంటిలోపలికి వెళ్ళి తలుపువేసి గడియపెట్టేశాడు.

గంగులు దాన్ని చేతికి తీసుకొని త్రిప్పిచూశాడు. దానికి మూత వుండవలసిన చోటున, అడ్డంగా లోగా ఒక గట్టి పెంకువుంది. గడ్డపారతో లోపలికి పొడిచాడు. తిప్పించికొట్టాడు. నాలుగైదు సార్లు కొట్టింతర్వాతగానీ అది పగిలి దారి యివ్వలేదు. లోపల ఏవో మిలమిల మన్నాయి. క్రిందికి క్రుమ్మరించాడు. వెండి నాణేలు క్రింద రాలేయి. అన్నీ లెక్కబెడితే ఏభైవున్నాయి. అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఎవరి నోటి నుంచీ ఒక్కమాట రాలేదు. గంగులు దాన్ని అలాగే తీసుకెళ్ళి ధాన్యం కడవలు దించి క్రింది కడవలో వుంచేసి అన్నీ మళ్ళీ యథాస్థానంలో పెట్టేశాడు.

"ఇంక పదండి మహాలక్ష్మి దయ" అని ఉత్సాహంతోనూ, ఎవరైనా చూస్తారేమో అన్న తొందరతోనూ, తలుపుతీసి పునాది దగ్గరకు వచ్చాడు. అందరూ మళ్ళీ పనిలో నిమగ్నులయ్యారు. ఆ కుండ దొరికిన ప్రదేశం చుట్టూ చాల త్రవ్వి చూశారు గానీ ఇంకేమీ కనిపించలేదు. అందరూ అలసిపోయి పని ఆపుచేసి పడుకొన్నారు.

* * *

గంటుకు పెద్ద 'నిధి' దొరికిందని, ఊరంతా విశేషంగా చెప్పుకొంటున్నారు. దాదాపు వెయ్యి రూపాయలు విలువ కలిగిన బంగారు దొరికిందని కొందరు, ఐదువందలు వెండి రూపాయలు దొరికాయని కొందరూ...ఎవరి వూహకు తట్టినట్లు వారు ప్రచారం చేశారు. గంగులును కొందరు గౌరవంతో, కొందరు ఈర్ష్యతో, కొందరు ద్వేషంతో చూడసాగారు.



గంగులును, గంగిని, నాగన్నను, లక్ష్మిని, నాగమ్మను అందరూ పిలిచి అడగటం, వీళ్లు 'అయ్యో...ఏమీ దొరక లేదు స్వామీ" అని చెప్పుకోవడం మామూలయిపోయింది.

ఒక రోజు సాయంకాలం గ్రామపెద్ద సుబ్బయ్య రహస్యంగా పిలిచి అడిగాడు.

"నీకు కడగాలు త్రవ్వగావుంటే వెండో, బంగారో ఏదో దొరికిందని అందరూ అంటున్నారు. ఎంత దొరికింది? మొదట నేను నమ్మలేదుగానీ...నువ్వు ముందుగా పెంకుటిల్లు కట్టాలని, ఇప్పుడు మిద్దె కట్టాలని అంటున్న తర్వాత నాకూ అనుమానం కలుగుతోంది. నిజంచెప్పు... నా దగ్గర దాపరికమెందుకు.....ఎంత దొరికింది గంగులూ" అన్నాడు.

"సత్తె పెమాణంగా చెప్తున్నాను సామీ. బంగారు గింగారు నాకేమీ దొరకలేదు. ముందు పెంకుటిల్లు వేయాలనే అనుకొంటిని. మిద్దెవేయను ఇంక ఇంతకన్న జాస్తీ ఏమీ కాదని మేస్త్రీ చెప్పినాడు. అందుకని అట్లనే చేద్దామనుకొంటిని" అన్నాడు గంగులు.

"నీ వేషాలన్నీ నాకు తెలుసు లేరా గంగులూ! నా దగ్గరా నీ వేషాలు! మర్యాదగా చెపుతున్నాను. న్యాయంగా అందులో సగం వాటా నాకిచ్చేయ్. లేదా...నీ పని పట్టిస్తాను. అసలు నువ్వు ఇల్లు కట్టుతున్న నేల ఎవరిది? కాగితాలన్నీ తిప్పిచూసినాను. పూర్వమంతా మాదే. దాన్ని మీకు అమ్మినట్లుగానీ, దానం చేసినట్టుగానీ ఎక్కడో దాఖలాలేదు. అదంతా మీ అనుభవంలో వుండేగానీ...ఇంతలో మీ సొంతమైపోలేదు. ఏమంటివి? ఏం చేస్తావు? సరేనా... వొప్పు

కొన్నస్సేనా" అని సాధికారంగా గంగుల్ని వాకాడు.

గంగులు ఆలోచిస్తున్నాడు. తను పెద్ద రైతు సుబ్బయ్య దగ్గర చేరకుండా స్వేచ్ఛగా ఇష్టంవచ్చిన వారిదగ్గర, లాభకారిగావున్న పనికి వెళ్ళి హాయిగా బ్రతుకుతున్నాడని ఆయనకు ఎంతో కాలం నుంచి ఆగ్రహంగావుంది. ఆ దళ్ళ వాళ్ళ చెఱకు తోటలో చెఱకు విరిచాడని నాగన్నను నడివూళ్ళో స్తంభానికి కట్టించి చచ్చేలా బాదగొట్టి, వొళ్ళు హూనం హూనంచేసి వొదిలిపెట్టారు. లక్ష్మి వంటరిగా పొలందగ్గర కనిపిస్తే, దాని కొంగు పట్టుకొని లాగి, అది తిడ్తే, "ఇక్కడేం గడ్డి కోస్తున్నావం" అని తను సేద్యగాళ్ళ్ని పిలిచి, ఇద్దరూ కలిసి చితక బాదించి పంపించారు. ఇవన్నీ తెలిసికూడా తను వూరుకోవలసివచ్చింది. ఈ దుర్మార్గు డిప్పుడు తనను బంగారు తెచ్చివ్వ మంటున్నాడు.

"ఏమిటిరా : ఇంకా ఆలోచిస్తున్నావు. రేపు రాత్రిలోగా తెచ్చిస్తావా...సరే లేదూ... హైసలయిపోతాన్! పోలీస్ రిపోర్టిచ్చి నీతాడు తెంచి ముప్పతిప్పలు పెట్టి నిన్ను మూడు చెరువులనీళ్ళు త్రాగించే వరకు వదలి పెట్టను. పోరా...పో... పోయి ఆలోచించుకో" అని టవలు భుజంమీద నుంచి తీసి విదిలించి మెడమీద వేసుకొని చరచరా వెళ్ళిపోయాడు సుబ్బయ్య.

గంగులు తిన్నగా ఇంటికి నడిచాడు ఇక ఈ వూళ్ళో బ్రతకడం సాధ్యం కాదని నిర్ణయించుకొన్నాడు. ఎందుకనో సుబ్బయ్య మాటలు వింటూవుంటే, ఇల్లు కట్టుకొని అందులో సౌఖ్యంగా బ్రతకాలనే కోరిక పటాపంచలై పోయింది.

తనకు ఏమీ ఆధారం లేదంటే ఇక ఎవరూ వినిపించుకోరు. కూలి చేసుకొని పొట్ట గడుపుకొనేవాడు ఇల్లు కట్టుకొంటా డంటే అందరికీ అనుమానమే. మనిషి శక్తిమీద ఉన్నతి కృషిమీద నమ్మకం లేని వాళ్ళందరికీ అనుమానం కలిగింది. పదివందల కొంపలు కూల్చి వాళ్ళ జీవితాలు నాశనం చేసిగానీ ఒక మేడకట్టుకోలేని పెద్దభూస్వాములు, ధనికులు తాము కష్టపడి కూలి చేసి ఇల్లు కట్టుకోవడాన్ని సహించలేకపోతు న్నారు. మొదటి నుంచీ తన కుటుంబం ఏ ఒక్కరికీ లొంగకుండా, సొంత పొలం లేకుండా, స్వశక్తిమీద ఆధారపడి నలుగురు చిన్న రైతులవద్ద పని చేసుకొంటూ గడపడం చూసి పెద్దవాళ్ళ కందరికీ తనమీద పగ! ఆ పగ తీర్చుకోడానికి సుబ్బయ్యకు అదను దొరికింది.

ఆరాత్రి ఊళ్ళో పరిస్థితిని ఇంట్లో అందరికీ వివరంగా చెప్పాడు. సుబ్బయ్యగా ప్రాణంతీస్తున్నాడు. వ్యాపారస్థులు "ఆ వెండి రూపాయలు మాకు తెచ్చివ్వు. దానికి సరిపడా నోట్లిస్తాం"మని పీడిస్తున్నారు. ఒక్కొక్కరూ రహస్యంగా పిలచి నయానా భయానా చెప్పి చూస్తున్నారు. ఇటువంటప్పుడు వీళ్ళ నుంచి తప్పించుకోడానికి ఇంక మార్గం లేదు! అందరూ ఆలోచించారు.

గంగులు తన నిర్ణయాన్ని అందరికీ చెప్పాడు. అందరూ "సరే" అన్నారు.

ఆ మరునాడు రాత్రి గంగులు రహస్యంగా, వొంటరిగా సుబ్బయ్యను కలుసుకొన్నాడు.

"నాకు మీరనుకొనేంత దొరకలేదు. ఏదో నాలుగువందల రూపాయలు వెండివి వున్నాయి. భయంతో నేను దాన్నింకా లెక్కపెట్టుకోనుకూడాలేదు. అంతా మీకే తెచ్చియిచ్చేస్తాను. నాకు. మున్నూరు రూపాయలు నోట్లు చేయించండి చాలు" అని మొలనుంచి నాలుగు వెండి రూపాయలు తీశాడు. "అవి ఇలాంటివి దొరికినాయి" అన్నాడు.

"సరే రాత్రికి షావుకారివాకిలి దగ్గర కనిపించు" అన్నాడు సుబ్బయ్య.

ఆ రాత్రివేళ చేతిలో చిన్న బరువైన సంచీతో గంగులు సుబ్బయ్యను షావుకారి వాకిలిదగ్గర కలుసుకొన్నాడు. సంచీ అందిచ్చి, నోట్లకట్టలు తీసి మొలలో దోపుకొని చాటుగా నడిచిపోయాడు.

గంగులు ఆదేశీయుడు...ఆ రాత్రంతా నడుస్తూవున్నాడు. గ్రామం, తాలూకా, జిల్లా సరిహద్దులన్నీ దాటి పోయాడు. వెళ్లి ఇదివరకే అక్కడ చేరిన కుటుంబాన్ని కలుసుకొని ఆ ఉదయమే రైలు బండెక్కి ఇంకా దూరం......బ్రతుకు తెరువు నిమిత్తం వెళ్లిపోయాడు.

ఆ రాత్రి ఆ సంచీని అలాగే ఇనప్పెట్టెలో వుంచేసి తృప్తిగా పడుకొన్నాడు సుబ్బయ్య.

మరునాడు. ఇంట్లో ఎవరులేని సమయం చూసి, గది తలుపులు బిగించి, ఇనప్పెట్టె తెరిచి సంచిబయటికి తీశాడు. దానికొసన కట్టిన ముడివిప్పి క్రింద కుమ్మరించాడు.

గలగలమని రాలాయి. సుబ్బయ్య కళ్లు బైర్లు క్రమ్మాయి. ఆయన తల గిర్రుమని తిరిగి మళ్ళా యధాస్థితిని నిలిచిపోయింది. కళ్ళు పెద్దవిచేసి ఇంకోసారి క్రిందికి చూశాడు.

అన్నీ పెంకుడు బిళ్ళలు. బరువుకోసం వుంచినాయి! తెల్లని వెండివంటి బండరాయి ముక్క! విచారంతో, కోపంతో రెండు చేతులతో కుప్పలో చేతులు పోనిచ్చి కెలికాడు.

ఒకేఒక్క వెండి రూపాయి మిలమిలా మెరుస్తూ వెక్కిరించింది.

ఆగ్రహ పరవశుడై సైకిలెక్కాడు సుబ్బయ్య. గదికి తాళం వేసి సరాసరి పల్లెకు వెళ్ళాడు. గంగులు గుడిసెలో ఎవరూలేరు. ఎక్కడో పనికి వెళ్ళి వుంటారని...తిరిగి వచ్చేశాడు.

రెండు రోజులకు కూడా గంగులు జాడ కనిపించలేదు. సుబ్బయ్య కోపం అదుపు తప్పింది.

వెంటనే సింగరయ్యను లాక్కురమ్మని మనుష్యుల్ని పంపించాడు.

దానితో గంగులుకు పెద్ద 'నిధి' దొరికిందని 'రహస్యం' చెప్పిన సింగరయ్య కాలును... బాగున్న ఇంకో కాలును కూడా విరిచేస్తేగానీ, తన ఆత్మతృప్తి పడదనుకొన్నాడు.

వణుకుతూవచ్చి నిల్చున్నాడు సింగరయ్య.

సుబ్బయ్య తనమీద విరుచుకు పడేసరికి 'కుయ్యో' అని అరిచేశాడు సింగరయ్య!